PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA
DK MEDIA
OUR SERVICES
* NEWS PAPER * NEWS CHANNEL * DK GRAPHICS
* DK ADS & PROMOTIONS * DK PRINTERS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 25 ఆదివారం, ఆగస్టు 23 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

### తెలంగాణ అభివృద్ధికి

## అడ్డంకులు సృష్టిస్తోంది



**సిద్దిపేట:** తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.' పల్లె పల్లెకు పొన్నం అన్న- పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్-2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతం గా తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కేంద్రం రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని

# కోరిన సీఎం బృందం

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రా మ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబే షన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందిం చుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమా నికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో చెప్పడాన్ని ఏఐసీసీ అధ్య క్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్‌పూల్ ఆసక్తి : లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు



మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి : లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యా ర్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది : సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన రేపటితో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్?కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు.

### కొండా సుస్మిత లైన్ దాటి

## ఆరోపణలు చేశారు



**హైదరాబాద్, ఆగస్టు 22 :** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కొండా సురేఖ విషయంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌పై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారు: సురేఖ వివరణ చదివామని తెలిపారు. కొండా సుస్మిత మాటల వీడియోలను చూ శామని చెప్పారు. ముఖ్యమం త్రిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. మంత్రి సురేఖ వివరణపై మరోసారి సమావేశం కావా లని భావించామన్నారు. క్రమశిక్షణ కమిటీకి మరి కొందరు ఎమ్మెల్యేలు వివరాలు ఇస్తామన్నారని చెప్పారు.

### 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్' పండగ ముందు

## ప్రజలపై భారం'




**న్యూ ఢిల్లీ :** దేశీయ మార్కెట్లో చక్కెర ధరలు ఇటీవల ఒక్కసారిగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ ప్రభుత్వం విధానాల వల్ల పండుగల సీజన్?కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపించింది. 'మోదీ ప్రభుత్వ విధానాల్లోని చేదు, చక్కెరలోని మాధుర్యానికి పాకింది' అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చమత్కరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ఆయన శనివారం చేసిన ఎక్స్‌లో ఒక పోస్టు పలు ప్రశ్నలు సంధించారు. "మోదీ ప్రభుత్వానికి నేను సూటిగా మూడు ప్రశ్నలు అడుగుతున్నా. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు గత 9 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఎందుకు పడిపోయాయి ఎగుమతులను నిలిపివేసి, 10 లక్షల టన్నుల చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునే స్థాయికి మనం ఎలా చేరుకున్నాం?. ఇక రెండోది, మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందు ప్రజలపై ఇంత భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? ముడోది, దేశంలో చక్కెర కొరత ఉన్నప్పుడు, ప్రభుత్వం చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, జు20 కోసం ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు.

### నేను శంకుస్థాపన చేశా..


## నేనే ప్రారంభిస్తున్నా



**అనకాపల్లి జిల్లా:** ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితుల హర్షంమార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదు రుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఆగస్టు 31వ తేదీన ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత పరిహారంగా రూ.250 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 48 రోజుల్లోనే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. మూడు విడతల్లో మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు అందించగా, శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు సీఎం చేతుల మీదుగా అందజేశారు. నిర్వాసితులకు ఇంకా రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తయితే 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

## 48 మందికి జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు

**న్యూ ఢిల్లీ :** పాఠశాల విద్య, అక్షరాస్యతకు చేసిన సేవలకు గుర్తింపుగా 48 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ అవార్డులు 2026ను ప్రకటించింది. అవార్డు గ్రహీతల జాబితాలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉపాధ్యాయులతో పాటు కేంద్రీయ విద్యాలయ సంఘటన్, నవోదయ విద్యాలయ సమితి, సైనిక్ పాఠశాలలు, ఆదర్శ గిరిజన పాఠశాలలు, పి.ఎం. శ్రీ పాఠశాలలు వంటి సంస్థలకు చెందిన వారు కూడా ఉన్నారు. 2026 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సెప్టెంబర్ 5న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 48 మంది పాఠ శాల ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అలాగే, పుర స్కారం అందుకున్న ప్రతి ఒక్కరి అద్భుతమైన కృషి, సేవలను తెలియజేసే లఘు డాక్యుమెంటరీలను కూడా ప్రదర్శిస్తారు. కాగా, ఎంపికైన వారిలో 26 మంది పురుషులు కాగా, 22 మంది మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల కృషిని గుర్తించి, వారి సేవలను గౌరవించేందుకు ఏటా ఈ పురస్కారాలను అందిస్తున్నారు. అవార్డు గ్రహీతల జాబితాలో గోవా నుంచి మహాదేవ్ హనమంత్ షిండే, గుజరాత్ నుంచి నితిన్ కుమార్ మహేంద్రకుమార్ పాఠక్, హరియాణా నుంచి అనిల్ కౌశిక్, హిమాచల్ ప్రదేశ్ నుంచి మంజరి వి. మహాజన్ ఎంపికయ్యారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన జాఫర్



ఆలమ్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. అలాగే, జమ్మూకశ్మీర్ నుంచి మహమ్మద్ అయాజ్ రైనా, మధ్యప్రదేశ్ నుంచి అర్చనా శుక్లా కూడా ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరితో పాటు మహారాష్ట్ర, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, లద్ధాఖ్? తదితర ప్రాంతాల నుంచి కూడా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.

### డీసీహెచ్‌ఎస్‌లు విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు?



**హైదరాబాద్, ఆగస్టు 22 :** ఆయా కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ మంత్రి దామోదర్ రాజనర్సింహ (వ్యాఖ్యానించారు. జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనూ మేజర్ సర్జరీలు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. (శనివారం) సచివాలయంలో మీడియాతో మంత్రి దామోదర్ మాట్లాడారు. టీచింగ్ హాస్పిటల్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లా, ఏరియా ఆస్పత్రులు, జఎజల్లో 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తామని చెప్పారు. చిన్న సమస్యలకే పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయొద్దని ఆదేశించారు. అవసరమైతేనే పేషెంట్లను పై ఆస్పత్రులకు రిఫర్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.

### ఏడంతస్తుల భవనం కూలి

## ఇద్దరు మృతి

**హైదరాబాద్ :** గచ్చిబౌలి అంజయ్యన గర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసా రిగా కుప్పకూలింది. ఆ భవనంలో ప్లంబి ంగ్ పనులు చేస్తున్న ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికి తీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ బిల్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలడం తో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతులను ఉమేశ్ కారె, మోపత్‌గా పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్ కు చెందిన వీరు టైల్స్ పనులు చేస్తూ కొండా పూర్‌లో నివాసం ఉంటున్నట్లుగా గుర్తించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు సీఎంసీ, హైడ్రా కమిషనర్లు సృజన, రంగనాథ్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు.



కూలిపోయిన భవన యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనాస్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగ నాథ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 50 గజాల్లో ఏడంతస్తులు కట్టారని, దానిపైన పెంట్‌హౌస్ కూడా వేస్తున్నారన్నారు. భవనం కూలి ఇద్దరు చనిపోయారని వివరించారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి భవనాలు చాలా ఉన్నాయన్నారు.

# ఆయుష్ వైద్య విద్యార్థుల డిమాండ్లు న్యాయమైనవి

- న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాడుతుంది.
- రోడ్డున పడ్డ ఆయుష్ వైద్యుల ఉసురు పోసుకోవద్దు.
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.



**వరంగల్, విశాలజ్యోతి:** వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల హౌస్ సర్జన్లు (ఇంటర్న్లు), పీజీ వైద్య విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై తెలంగాణ ఆయుష్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక ధర్నాకు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా పూర్తి మద్దతు ప్రకటిస్తోందని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తెలిపారు. శనివారం కళాశాల ప్రాంగణంలో 19వ రోజు జరుగుతున్న నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి, విద్యార్థులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ అల్లోపతి వైద్యులతో సమానంగా విధులను నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్య విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపడం దురదృష్టకరమన్నారు. ఒకే రకమైన సేవలు అందిస్తున్నప్పటికీ, అల్లోపతి హౌస్ సర్జన్లకు నెలకు ?29,972 స్టైపెండ్ ఇస్తూ, ఆయుష్ హౌస్ సర్జన్లకు కేవలం ?13,754 మాత్రమే ఇవ్వడం తీవ్రమైన అన్యాయమని ఆయన మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయుష్ విద్యార్థుల స్టైఫండ్‌ను పెంచాలని అసెంబ్లీలో గళమెత్తారని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టారని బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ విమర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 77 ప్రకారం ఆయుష్ విద్యార్థులకు నెలకు ?30,000 స్టైపెండ్ ఇవ్వాల్సి ఉన్నా, దానిని అమలు చేయకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనం అని అన్నారు. విద్యార్థులకు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ఆయుష్ జేఏసీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని గంట రవికుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



- ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాసరావు

**హనుమకొండ, విశాలజ్యోతి:** పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్. శ్రీనివాసరావు అన్నారు, ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో–ఎడ్యుకేషన్) హనుమకొండలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను మరియు చెత్తాచెదారం, విరిగిపోయినటు వం టి, చెట్లను తొలగించారు. గడ్డిని తొలగించా రు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యత అని మన చుట్టూ ఉన్న ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని పరిశుభ్రతను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. రాజ్ కుమార్, అధ్యాపకులు యాకూబ్, రాజేంద్ర ప్రసాద్,రాజేష్, రమేష్, యాకయ్య ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా విద్యార్థుల ర్యాలీ

- కొవ్వొత్తులు వెలిగించి మానవహారంతో శ్రద్ధాంజలి.
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్.



**నందిపేట్, విశాలజ్యోతి :** నల్గొండలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా నందిపేట్ మండల కేంద్రంలోని అక్షర హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి, మానవహారంగా నిలిచి రూపారెడ్డికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. రూపారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులు చేపట్టిన ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల పట్ల గౌరవం, మహిళల భద్రత, హింసకు వ్యతిరేకంగా విద్యార్థుల ఐక్యత స్పష్టంగా కనిపించింది.

# యు.పి.హెచ్.సి. కాశీబుగ్గను తనిఖీ చేసిన డి ఎం హెచ్ ఓ



**వరంగల్, విశాలజ్యోతి:** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డా. బి. రాజా రెడ్డి గారు యు.పి.హెచ్.సి. కాశీబుగ్గను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఓపీ సేవలు, మాతా శిశు ఆరోగ్య సేవలు, ఇమ్యునైజేషన్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు మరియు రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందేలా చూడాలని, అన్ని రికార్డులు మరియు రిపోర్టులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వివేకానంద కాలనీలో నిర్వహిస్తున్న ఔట్‌రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని కూడా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి గారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రాప్‌అవుట్, లెఫ్ట్‌అవుట్ పిల్లలు లేకుండా ప్రతి అర్హత కలిగిన చిన్నారికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు డ్యూ లిస్ట్ ప్రకారం పిల్లలను గుర్తించి, ఇమ్యునైజేషన్ కేంద్రాలకు మొబిలైజ్ చేయాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాలు పిల్లలను వివిధ ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, తల్లిదండ్రులకు టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి పూర్తి స్థాయిలో టీకాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యు.పి.హెచ్.సి. వైద్యాధికారి డా.కిరణ్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచి గోలేటి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి



**కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన అజ్మీరా సురేష్ కుమారుడు, కబడ్డీ ఛాంపియన్ లో అజ్మీర భరత్ ఇటీవలే ఒడిస్సా లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఛాంపియన్ షిప్ సాధించి, ఈ నెల 26 న హర్యానాలో జరుగబోయే కబడ్డీపోటీల్లో పాల్గొంటారు. హర్యానా ప్రయాణానికి , కొమరంభీంఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయస్థాయిలో రాణిస్తున్న భారత్ కు తమ గొప్ప మనసుతో ఖర్చుల నిమిత్తం5000,ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో గోలేటి సర్పంచ్ అజ్మీరా బాబు రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ రంగు మహేష్ గౌడ్, కొమురవెల్లి సర్పంచ్ పరకాల సాగర్ గౌడ్, రెబ్బెన మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ బొమ్మిదేని శ్రీధర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** రెబ్బెన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఎన్నిక మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. రెబ్బెనమండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ కమిటీ ఎన్నికకు సంబంధించి నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మండల కమిటీని పార్టీ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసి,పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆత్రం సుగుణక్క సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె ప్రకాష్ రావు, జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్, జిల్లా కార్యదర్శి చిరంజీవి గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చెన్న సోమశేఖర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఏలగల సాయికుమార్, సీనియర్ నాయకులు బలరాం నాయక్, గోపాల్ నాయక్, ఈశ్వర్ నాయక్, ప్రభాకర్, సాంబగౌడ్,దత్తేశ్వర్,ఇగురపు రవి, కుందరపు నాగేష్,ఇమ్ము, దుర్గం రాజేష్, రాజి రెడ్డి, చంద్రశేఖర్, ఇంద్ర ఫెలోషిప్ అసెంబ్లీ కోఆర్డినేటర్ విజయ,మహిళా నాయకులు శంకరమ్మ, పద్మ.

రాజేశ్వరి, వార్డ్ సభ్యులు బనోత్ రవి, పాస్తం రాజు, గొగ్లర్ రాజేష్, ఆవిడపు గోపి,ఎర్ర సంతోష్, దేవర కొండ సంతోష్, గజ్జల శ్రుజన్, బాను ప్రసాద్,గండె సంతో ష్,మడ్డి శ్రీను, ఇప్ప రమేష్,ఎర్గటి పోషం, దుర్గం అన్నజి, ఏండ్ల రవి, యువజన కాం గ్రెస్ ఉపాధ్యకులు సంజయ్, ఇంగు ,మం డల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లంకెబిందెల కోసం తవ్వుతున్నారేమో సెక్రటేరియట్

## ముందు భారీ గుంతపై కేటీఆర్ సెటైర్స్



హైదరాబాద్‌లోని రోడ్ల దుస్థితికి సంబంధించిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఏకంగా తెలంగాణ సచివాలయం ముందే పెద్ద గుంత తవ్వి అలాగే వదిలేయడంపై ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భారీ గుంతను చూపిస్తూ ట్విట్టర్ (ఎక్స్)లో చేసిన పోస్టుపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పోస్టుపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు.రాజకీయ వార్తలు మరియు విశ్లేషణలను అనుసరించడంశివ అనే నెటిజన్ తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో సచివాలయం ముందు ఉన్న భారీ గుంత గురించి వీడియో తీసి పెట్టాడు. సెక్రటేరియట్ ముందే ఇంత పెద్ద గుంత ఉంది. ఎవరైనా సెక్రటేరియట్ చూసుకుంటూ వస్తే ఈ గుంతలో పడి ఛస్తారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇంతమంది పోలీసులు వెళుంటారు. ఇంతమంది జనాలు వెళ్తుంటారు.. అలాంటి చోట ఏంటి గుంతనా అని ప్రశ్నించారు. సీఎం గారూ హుస్సేన్ సాగర్‌ను ఇక్కడ కూడా పెట్టాలని అనుకుంటున్నారా అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. రోజూ ఎంతోమంది తిరుగుతుంటారు.. దీన్ని క్లోజ్ చేద్దామన్న రెస్పాన్సిబిలిటీ ఉండదా జీహెచ్‌ఎంసీ వాళ్లు రోడ్లపై తిరుగుతూ చూడరా అస్తమానం ఎవరో ఒకరు కంప్లయింట్ ఇస్తేనే తెలుస్తుం దా అని నిలదీశారు. వీలైనంత తొందరగా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అంతేకాకుండా.. లోపల ఇలాంటివి చాలా ఉన్నాయ్.. లోపల దాచిపెట్టాం అని జీహెచ్‌ఎంసీ అన్నట్లుగా క్యాప్షన్ పెట్టాడు.

## ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత



- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి.

**మహబూబ్‌నగర్, విశాలజ్యోతి:** ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో కొలువైన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందన్నారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ మహబూబ్‌నగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, బుద్దారం సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు వాణిశ్రీ ప్రశాంత్, రమేష్ రెడ్డి, మేగ్యా నాయక్, నాయ కులు మైత్రి యాదయ్య, వర్థ రవి, రమేష్ యాదవ్, రాఘవ, పీర్ మహ్మద్ సాధిక్, చంద్రమౌళి , తుప్పలి ఆంజనేయులు తది తరులు పాల్గొన్నారు.

## ప్రజల భూములు కబ్జా చేసే హక్కు ఎవరిచ్చారు రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ధ్వజం



నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30% కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ఏ బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు.సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పు డు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యా లయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డు పెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని చేశారు.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# ఏఐటీయూసీ పోరాటాలతోనే జీతాల పెంపు

- ఆయుష్ ఎస్.ఎన్.ఓ.లకు జీవో నంబర్ 60 పట్ల హర్షం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా

**హైదరాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** ఎన్ హెచ్ ఎం లో ఆయుష్ డిపార్ట్మెంట్ లో ఎస్.ఎన్. ఓ.లు పనిచేస్తున్నారు. వారికి వేతనం పెంచడం ఏఐటీయూసీ పోరాటాల ఫలితమేనని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రమణ్యం , రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ దేవనబోయిన బాపు యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో



వారు మాట్లాడుతూ ఆయుష్ ఎస్.ఎన్.ఓ.లకు జీవో నంబర్ 60 ప్రకారం రూ.15600 వేతనాన్ని పెంచడాన్ని ఏఐటీయూసీ హర్షిస్తుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఉద్యోగులకు రావలసిన 2 వ పీ.ఆర్.సీ. త్వరగా విడుదల చేయాలని రెగ్యులర్ ఉద్యోగుల యొక్క బేసిక్ వేతనాన్ని ఆయుష్ ఎస్. ఎన్.ఓ.లకు అమలు చేసి న్యాయం చేయాలన్నారు. ఉద్యోగులందరనీ రెగ్యులర్ చేసేంత వరకు ఏఐటీయూసీ న్యాయ పోరాటం చేస్తుందన్నారు. ఆయుష్ ఎస్.ఎన్.ఓ. వేతనాన్ని పెంచినందుకు గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, శ్రీ గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డికి ,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ప్రత్యేక కృతజ్ఞతలు ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు.

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం సాగించాలని ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.సీతారా మయ్య పిలుపునిచ్చారు. సెప్టెంబరు1వ తేదీన కొత్తగూడెంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కొత్తగూడెంలో సింగరేణి హాస్పిటల్, బాబు క్యాంపు, బర్మా క్యాంపు, నర్సు క్వార్టర్స్ లో గేట్ మీటింగులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి హాస్పిటల్లో ప్రమాదాలకు, అనారోగ్యాలకు గురైన వారికి వైద్యం చేయడం లేదని అవేదన వ్యక్తం చేశారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టం ఉందని దానిని అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పుఇచ్చినా హై పవర్ వేతనాలు ఇవ్వాలని కోల్ ఇండియా ఒప్పందం ఉన్నా సింగరేణిలో 35వేల మంది కాంట్రాక్టు




కార్మికులకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమ దోపిడికి వ్యతిరేకంగా చట్టాల అమలుకోసం ఉద్యమానికి సిద్ధంకావాలని ఐఎఫ్ టియు రాష్ట్రఉపాధ్యక్షులు జే.సీతారామయ్య పిలుపనిచ్చారు. త్వరలో సిఈఆర్ క్లబ్ లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్ టియు) రీజియన్ కార్యదర్శి నెమిల్ల సంజీవ్ అధ్యక్షత వహించగా పుష్ప రాజు, రాధా, లలిత, విజయ కుమారి, సంజీవరావు, లక్ష్మి, రమణ, పుష్ప, వెంకటేశ్వర్లు, జకరయ్య, నిర్మల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దర్యాప్తులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- కేసుల దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** దర్యాప్తులో చిన్నపాటి లోపాలకు కూడా తావు లేకుండా చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెం ఐఎంఈ ఫంక్షన్ హాల్లో శనివారం ఈగల్ ఫోర్స్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూ డెం జిల్లాలో ఎన్డీపీఎస్ చట్టానికి సంబంధించిన కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. శిక్షణలో ఎన్డీపీఎస్ కేసుల్లో నిందితుల గుర్తింపు అరెస్టు సీజ్ ప్రక్రియ పంచనామా సాక్ష్యాల సేకరణ కేసు దర్యాప్తు చార్జ్షీట్ దాఖలు తదితర అంశాల్లో పాటించాల్సిన చట్టపరమైన విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎన్డీపీఎస్ చట్టంలోని వివిధ సెక్షన్లు వాటి అమలు విధానం కోర్టు విచారణ సమయంలో ఎదురయ్యే అంశాలు దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సాక్ష్యాధారాల పరిరక్షణ తదితర అంశాలను వివరించారు. దర్యాప్తులో చిన్నపాటి లోపాలు కూడా కోర్టు విచారణ సమయంలో న్యాయపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి దశలోనూ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని





సూచించారు.డ్రగ్స్ అక్రమ రవాణా వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని, ఎన్డీపీఎస్ కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో కేసులను దర్యాప్తు చేయాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు సూచించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ దర్యాప్తులో చోటుచేసుకునే లోపాలను గుర్తించి వాటిని సవరించుకోవడంతో పాటు కేసుల పురోగతిపై పోలీసు అధికారులు శిక్షణలో తెలియజేసిన సూచనలు పాటించాలని సూచించారు. ప్రతి కేసులోనూ దర్యాప్తు అధికారులు చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పక్కా ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలని సూచించారు. ఈ సం దర్భంగా శిక్షణా తరగతులు నిర్వహించి పోలీ సు అధికారులకు సిబ్బందికి చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎల్.హెచ్.రాజేశ్వరరావు, ఫణికుమార్లను జిల్లా ఎస్పీ అభినందించి సన్మానించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్.సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ పాల్గొన్నారు.

# పాలిటెక్ విద్యను అభివృద్ధి చేయండి

- నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి
- పాలిటెక్నిక్ లో నిరసన కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** పాలిటెక్నిక్ విద్యను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరిం చుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. శనివారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో అనుసంధానం చేసే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఈ నిర్ణయం అమలైతే వేలాది మంది విద్యార్థుల విద్యా ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. డిప్లొమా విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించే లాటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయవద్దని అజిత్ కోరారు. విద్యార్థులకు నష్టం కలిగించే శక్తి స్కీమ్ను, జీవో నెంబర 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలపై ప్రభుత్వం విద్యార్థులు అధ్యాపకులతో చర్చించాలని సూచించారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని అవసరమైతే సమస్యల




పరిష్కారం కోసం ఆమరణ దీక్షకు సైతం సిద్ధమని అజిత్ హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సం జయ్, నాయకులు సలిగంటి జయదీప్, ముది గొండ నిరీక్షణ, ప్రియాంషీ, సాయి కృష్ణ, నీలాద్రి, బండి హాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చిరంజీవికి భారతరత్న అవార్డు ఇవ్వాలి

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్
- ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు
- రక్తదాన శిబిరం ఏర్పాటు
- రైల్వే స్టేషన్ ఆవరణలో పేదలకు అన్నదానం

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** సామాజిక సేవలను అందిస్తున్న మెగాస్టార్ చిరంజీవికి భారతరత్న అవార్డును ప్రదానం చేయాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మైటీ మెగాస్టార్ స్టేట్ ఫ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో శనివారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ చిరంజీవి మధ్యతరగతి కుటుంబంలో జన్మించికృషి దీక్షా దక్షితలు కఠోర పరిశ్రమ వృత్తి పట్ల అంకితభావం అనునిత్యం అహర్నిశలు కష్టపడే మనస్తత్వం అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇటు సినీ రంగంలో రాణిస్తూ అటు సామాజిక సేవలందిస్తున్న చిరంజీవిని గుర్తించి ఆయనకు ప్రభుత్వం వెంటనే భారతరత్న అవార్డును ప్రధానం చేయాలని కోరారు. అదేవిధంగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబులు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సేవలను కొనియాడారు. సభ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం రూపశిల్పి మెగాస్టార్ చిరంజీవికి వీరాభిమాని సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ఏ హీరోకు లేని సేవ తత్పరులైన అభిమానులు చిరంజీవికి మాత్రమే ఉన్నారని మెగాస్టార్ చిరంజీవిలో కష్టించే మనస్తత్వం అందరినీ ప్రేమించే మనస్తత్వం నిరంతర



సేవా తత్పరత ఉందన్నారు. తాను చిరంజీవి అభిమానిని కావడం పూర్వజన్మ సుకృతమని అన్నారు.మెగాస్టార్ చిరంజీవి పొందని అవార్డులు రివార్డులు లేవని తప్పకుండా భారత ప్రభుత్వం భారతరత్న అవార్డును అందించాలని విజ్ఞప్తి చేశారు.తొలుత మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే కేక్ ను కట్ చేసి అతిథులందరూ ఆనందంతో ఒకరికొకరు తినిపించుకొని పంచిపెట్టారు. అనంతరం మెడికేర్ డయాగ్నస్టిక్స్ సెంటర్ అధినేత డాక్టర్ ప్రవీణ్ సారధ్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పేదవారికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.తొలుత ప్రముఖ కళాకారులైన స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, అపర బాలు అల్లి శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మధుర గాయని మణి మునీల ఆలపించిన చిరంజీవి చిత్రాల్లోని పాటలు అందరిని ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లూరి నాగరాజు, కార్పొరేటర్లు కనుకుంట శ్రీను కేకే, బ్యాండ్ దుర్గా, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, అసోసియేషన్ నాయకులు స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, అపరబాలు అల్లిశంకర్, సింగరేణి సేవా సమితి నాయ కురాలు మునీల, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయ కులు అంతోటి పాల్, గుగులోత్ కృష్ణ, విగ్నేష్, సురేందర్, సల్మాన్ ఖాన్ తోతా, డాక్టర్ తమ్మళ్ళ జోసెఫ్ రవి, శనగ లక్ష్మణ్, ఉల్లోజు వెంకటరమణ,ప్రిన్సిపల్ దేవీలాల్, చింతల యాడ్స్ ప్రవీణ్, అంతోటి రాజు, బడికల రమేష్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, ఆఫ్రైమ్ చింటూ, అఖిల్, పెనగడప శ్రీను, రాజే శ్వర రావు, సాయి కుమార్ పాల్గొనగా రక్తదాన శిబిరాన్ని సరళ బ్లడ్ బ్యాంక్ నుండి రామకృష్ణ వినయ్ కిరణ్ తదితరులు నిర్వహించారు.

# మైనర్ డ్రైవింగ్పై విద్యార్థులకు న్యాయ అవగాహన

**నిజామాబాద్, విశాలజ్యోతి:** విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్లోని కాకతీయ విద్యాలయంలో న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా నాలుగో అదనపు సెషన్స్ జడ్జి, మహిళా కోర్టు జడ్జి దుర్గా ప్రసాద్, జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జి, జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి ఉషా కిరణ్ పాల్గొని విద్యార్థులకు పలు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది మచ్చర్ల విజయ్ సామ్రాట్ మైనర్ డ్రైవింగ్, జువినైల్ జస్టిస్ యాక్ట్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. చిన్న వయసులో వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలు, రహదారి భద్రతా నిబ





ంధనలు, బాలల హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు విజయ్ సామ్రాట్ చేసిన కృషిని జడ్జి దుర్గా ప్రసాద్ అభినందించారు. అనంతరం జడ్జి ఉషా కిరణ్ చేతుల మీదుగా విజయ్ సామ్రాట్కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చట్టాలపై అవగాహన చిన్ననాటి నుంచే కల్పిస్తే బాధ్యతాయుతమైన పౌర సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని సదస్సులో పేర్కొన్నారు.

కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులు పనికి రారంటున్న వాళ్లకు బ్రెయిన్ లేదు డాక్టర్ లావు రత్తయ్య

ఇంజనీరింగ్ విద్యార్థులు క్రిమినల్ వేస్ట్.. వారికి కనీసం జాబ్ అప్లికేషన్ నింపడం కూడా రాదు.. సంవత్సరానికి లక్షా 10 వేల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ సర్టిఫికేట్ తీసుకుంటున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారాన్ని లేపిన విషయం తెలిసిందే. ఓ వైపు విద్యార్థులు, మరోవైపు ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో.. దురదృష్టవశాత్తు ప్రభుత్వంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కూడా ఇంజనీరింగ్ విద్యార్థులు



పనికి రారంటున్నారు. అలా అంటున్నవాళ్లకు బ్రెయిన్ లేదని విజ్ఞాన్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ లావు రత్తయ్య అన్నారు.ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు ఎప్పుడూ కూడా పనికిరాని వారు కాదు. రెండు మూడు కేసుల్లో కానీ, ఓ ఐదారు శాతం కానీ ఉండొచ్చు. వారిలో ఎక్కువ మంది సుమారు 80 శాతం ప్రొడక్టివ్.. అంతకంటే ఎక్కువ పోటీతత్వం ఉన్నవాళ్లు. వారు యూఎస్కు వెళ్తున్నారు. వారిలో ఒక్క విద్యార్థి కూడా డిగ్రీ లేకుండా ఇండియాకు తిరిగొస్తలేరన్నారు. ఈ విద్యార్థులు ఎక్కువ ఫోకస్ ఉన్నవాళ్లు, కష్టపడే తత్వం ఉన్నవాళ్లని అన్నారు. ప్రభుత్వంలో ఉన్నబాధ్యత గల వ్యక్తులు ఎలా వారిని పనికిరాని వారని అంటారో నాకు తెలియదని లావు రత్తయ్య పేర్కొన్నారు.

## ఖాజాగూడలో బైక్ బోల్తా పడి యువకుడు మృతి ఇద్దరికి తీవ్ర గాయాలు

**శేరిలింగంపల్లి:** హైదరాబాద్లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఫరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఖాజాగూడలో శనివారం తెల్లవారుజామున వేగంగా దూసుకొచ్చిన ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కింద పడింది. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో ముగ్గురు యువకులు విట్పిలెన్ మోటార్సైకిల్పై ఖాజాగూడ నుంచి అంజయ్యనగర్ వైపు వెళ్తున్నారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ సమీపంలో ఈఎస్ఐ రెండో గేటు నుంచి కేర్ ఆస్పత్రి మెయిన్ రోడ్డుకు కుడివైపు మలుపు తిరుగుతున్న సమయంలో అతివేగం కారణంగా బైక్ అదుపతప్పింది.ఈ ప్రమాదంలో వెనుక కూర్చొన్న అబ్బాస్ సిద్ధిఖ్ (25) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

బైక్ నడుపుతున్న సహస్ర చటోపా ధ్యాయ్ (25), మధ్యలో కూర్చొన్న అభిజిత్ సింగ్ (25) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమా దంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను పశ్చిమ బెంగా ల్కు చెందిన వారిగా గుర్తించారు.

# ఇప్పటికైనా కళ్లు తెరిచి కాళేశ్వరం ప్రాజెక్టును

## వినియోగంలోకి తేవాలి మాజీ మంత్రి జీవన్ రెడ్డి




**సిరిసిల్ల :** తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యనిర్వాహక ప్రభుత్వ సేవలను తెలుసుకోవడంఅన్నారం, సుం దిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్ తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్ట వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటిక ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయ ని హెచ్చరిస్తున్నాయని అన్నారు.

రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సందర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని విమర్శించారు. కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శించారు. కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద రూ. 100 కోట్ల తో కాఫర్ డ్యాం కట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు. కేసీఆర్ దూర దృష్టితో కాళేశ్వరం కట్టారని గుర్తు చేశారు.

# తొలగించిన కాంట్రాక్ట్ కండక్టర్లను

## విధుల్లోకి తీసుకోవాలి




**హనుమకొండ చౌరస్తా:** వరంగల్ రీజియన్ ఆర్టీసీ లో ఏడాది నుంచి 90 మంది కండక్టర్లు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. యాజమాన్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే విధుల నుంచి తొలగించింది. దీంతో వారు శనివారం హనుమకొండలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సంవత్సరం నుంచి తమతో విధులు చేయించుకుని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి సంబంధించిన పలు కీలక సమయాల్లో మేడారం మహాజాతరను విజయవంతం చేయడంలో తమ పాత్ర ఎంతో ఉందని అన్నారు. అలా తమ సేవలను వినియోగించుకున్న తర్వాత అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, తమ కుటుంబాలను రోడ్డున పడకుండా ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారుఆర్టీసీ సంస్థకు చెందిన కొన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు తమను తీసుకుని ఇప్పుడు తొలగించడం అన్యాయమని, డబ్బులు ఇచ్చినవారిని తొలగించలేదని వాపోయారు. గత ఆర్ఎం–ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు కుమ్మక్కయ్యారని, డిసెంబర్ వరకు అగ్రిమెంట్ ఉన్నా కూడా చెప్పకుండా అకారణంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సంస్థకు చెందిన అక్షయ ఎంటర్‌ప్రైజెస్, ఏషియన్ మ్యాన్‌పవర్ అండ్ ప్లేస్‌మెంట్స్‌సర్వీస్, హనుమాన్ మ్యాన్ పవర్ సర్వీస్, ఓంసాయి సెక్యూరిటీ ఫోర్స్, శ్రీనివాస గ్రూప్స్ ఎస్వీ, శ్రీఆంజనేయ మ్యాన్‌పవర్ ఏజెన్సీ, పరమేశ్వర ఎంటర్‌ప్రైజెస్, విజ్ఞాన్ మ్యాన్‌పవర్, ఎస్ఆర్‌కేటీ ఏజెన్సీలు కొంతమంది వద్ద డబ్బులు తీసు కుని ఇప్పుడు తొలగించాలరని, ఇందులో ముఖ్యంగా చంద్రశేఖర్ ఏజెన్సీ ఎక్కువ మందిని తీసుకున్నట్లు వారు ఆరోపించారు.

డబ్బులు తీసుకుని నియమించిన ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల యజమానులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

# రెడ్లకో న్యాయం బీసీలకో న్యాయమా

## కొండా సురేఖకు నోటీసులపై బీసీ నాయకుల ఆగ్రహం




**హనుమకొండ చౌరస్తా :** దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై వివిధ బీసీ సంఘాల నాయకులు తీవ్రంగా స్పందించారు. బీసీల పట్ల ఒక రకమైన న్యాయం, రెడ్డి సామాజిక వర్గం పట్ల మరో రకమైన న్యాయం జరుగుతోందని బీసీ ఐక్యవేదిక నాయకులు ప్రశ్నించారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సామాజికవేత్త, బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాటాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి చెందిన సామాజిక వర్గానికి చెందిన కొంతమంది శాసనసభ్యులు అనేక సందర్భాల్లో ఏకవచనంతో విమర్శించినప్పటికీ, అప్పట్లో ప్రభుత్వం అదే స్థాయిలో స్పందించలేదని ఆరోపించారు.

బీసీ మహిళగా, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖ విషయంలో మాత్రం ప్రభుత్వం అతిగా స్పందించి షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. బీసీ మహిళా మంత్రి విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు సామాజిక న్యాయం సూత్రాలకు అనుగుణంగా ఉందా అని ప్రశ్నించారు. ఈ సమావేశం లో వివిధ కులసంఘాల బీసీ నాయకులు రాంపెల్లి లింగమూర్తి, ఆడెపు సుధాకర్, డాక్టర్ మియాపురం శివుడు, గోవిందుల జనార్ధన్, టౌటం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్

## తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు




**హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌అనర్హత పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు.

తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయి దా వేసింది.

## హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్




లండన్ యూనివర్సిటీ ప్రతినిధులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానం చేసే ప్రతిపాదనపై చర్చ జరిగింది. వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా విస్తృత విద్యా కోర్సులు అందించనున్నారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు రామకృష్ణారావు, జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

## వేలేరు మండలానికి సాగునీరు అందించాలని

# ఎమ్మెల్యే శ్రీహరికి వినతి



**వేలేరు:** వరంగల్ జిల్లా వేలేరు మండలంలోని రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మీరా కి శనివారం వినతిపత్రం అందజేశారు. మం డలంలోని సాగు భూములకు గోదావరి జలా లు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగవంతం చేయాలని కోరారు.

వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం కోసం ఎత్తిపోతల పథకాలు, పైప్‌లైన్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలేరు మండలానికి గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందించి రెండు పంటలకు సాగునీరు కల్పిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారావు, సర్పంచ్ మరిజె అనిత, నాయకులు విజేందర్ రెడ్డి, జానీ, హరీఫ్ పాల్గొన్నారు

## లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు

# చిక్కిన చందానగర్ ఎస్ఐ




**హైదరాబాద్:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాలరాజు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మరో ఇద్దరు కానిస్టేబుళు రఘు, రాజ్‌కుమార్‌లను కూడా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాధితుడి నుంచి లక్ష రూపాయిలు లంచం తీసుకుంటుండగా.. ఎస్ఐతోపాటు కానిస్టేబుళ్లను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి లంచం సొమ్మును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారందరిని పోలీస్ స్టేషన్ లో విచారిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. లంచం వ్యవహారంలో పూర్తి వివరాలను వారి నుంచి ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు.

## డీసీహెచ్‌ఎస్‌లు విధులకు గైర్హాజరైతే

## కఠిన చర్యలు మంత్రి దామోదర్

**హైదరాబాద్:** ఆయా కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ మంత్రి దామోదర్ రాజనర్సింహ వ్యాఖ్యానించారు. జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనూ మేజర్ సర్జరీలు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. సచివాలయంలో మీడియాతో మంత్రి దామోదర్ మాట్లాడారు. టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లా, ఏరియా ఆస్పత్రులు, జఎజల్లో 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తామని చెప్పారు. చిన్న సమస్యలకే పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయొద్దని ఆదేశించారు. అవసరమైతేనే పేషెంట్లను పై స్థాయి ఆస్పత్రులకు రిఫర్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.

అత్యవసర రిఫరల్‌కు ముందు సంబంధిత ఆస్పత్రికి సమాచారం ఇవ్వాలని సలహా ఇచ్చారు. అవసరమున్న ఆస్పత్రుల్లో కొత్త సీటీ స్కాన్లు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతామని అన్నారు. పరికరాల ప్రతిపాదనలకు రోగుల సంఖ్య, అవసరంపై జస్టిఫికేషన్ తప్పనిసరని చెప్పారు.

# గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం

## శిథిలాల కింద ఇద్దరు మృతి మరో ఇద్దరికి గాయాలు



**కొండాపూర్ :** రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొండాపూర్ లో ఏడంతస్తుల భవనం శనివారం మధ్యాహ్నం కుప్పకూలింది. అయితే శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా అనే కోణంలో అగ్నిమాపక, పోలీసులు, హైడ్రా బృందం గాలింపు మొదలు పెట్టారు. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్ లో 50గజాల స్థలం లో చేపట్టిన అక్రమ నిర్మాణం పూర్తిగా కుప్పగిలింది. నాలను అనుకుని అక్రమంగా తక్కువ స్థలంలో ఏడు అంతస్తులతో నిర్మిస్తున్న హాస్టల్ భవనం ఒక్కసారిగా కుప్పకూలి పక్కనే ఉన్న ఆపార్టుమెంట్‌పై పడడంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. శిథిలాల కింద పడి ఇద్దరు మృతి చెందారు. పక్కన ఉన్న ఆపార్ట్ భవనంపై శిథిలాలు పడడంతో భార్యభర్తలు రమణారెడ్డి, సంయుక్తకు గాయాలయ్యాయి. ఘటన జరిగిన సమయంలో హాస్టల్ లోని అందరూ భయంతో పరుగులు తీశారు. హైడ్రా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు మొదలు పెట్టి ఇద్దరు మృతదేహాలను బయటకు తీశారు. మృతులు ఎవరనేది ఇంకా తెలియరాలేదు.

## రేవంత్ రెడ్డి షెడ్యూల్‌లో ఎవరిని కలుస్తున్నారో వారి పేర్లు లేవు

# ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్



**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డిని కేంద్ర విదేశాంగ శాఖ అవమానించింది.. లండన్‌కు పర్మిషన్ ఇచ్చా రు. కానీ అమెరికాకు వెళ్లేందుకు పర్మిషన్ ఇవ్వలేదు. గతంలో ఏ ముఖ్యమంత్రికి ఈ విధంగా జరగలేదు. ఇది రేవంత్ రెడ్డికి చెంప పెట్టు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అవమానం అని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర విదేశాంగ శాఖ పర్మిషన్ ఇవ్వని విధంగా తప్పుడు నిర్ణ యాలు ఏం తీసుకున్నారో బయట పెట్టాలి.

రేవంత్ రెడ్డి ఏం తప్పు చేస్తారని కేంద్ర విదేశాంగ శాఖకు తెలిసింది.. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి,కేంద్రం ఇద్దరు సమాధానం చెప్పాలన్నారు..రేవంత్ రెడ్డి షెడ్యూల్ లో ఏం తప్పులు ఉన్నాయో తెలంగాణ ప్రజలకు చెప్పాలి.. రేవంత్ రెడ్డి పై కేంద్రం ఆరోపణలు చేసి అమెరికా పర్యటనను రద్దు చేసింది.. సందర్భం కాని పనులు సీఎం రేవంత్ రెడ్డి ఏం చేద్దామని అనుకున్నారని అడిగారు. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యాలకు వ్యతిరేకంగా షెడ్యూల్ ఉందా.. రేవంత్ రెడ్డి తన సీఎం పదవికి తగని విధంగా పనులు చేస్తున్నారని కేంద్రం చెప్పకనే చెప్పింది.

సీఎం రేవంత్ రెడ్డి మనకు తెలియని విషయాన్ని అమెరికాలో చేస్తున్నారు . ఆ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి,కేంద్రం ఇద్దరూ దాస్తున్నారు. ఏ కారణాలతో రేవంత్ రెడ్డిని ఆపారో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉన్న న్యూయార్క్ మేయర్ మందాని ను కలవడానికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్తే ఆపారని అంటున్నారు. రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా అందానీ కోసం పోవాలనుకున్నారా. లేక న్యూ యార్క్ మేయర్ మందాని కోసం పోవాలనుకున్నారా..?ఆగస్టు 27,28 వ తేదీన రేవంత్ రెడ్డి షెడ్యూల్ లో ఎవరిని కలుస్తున్నారో వారి పేర్లు లేవు. రేవంత్ రెడ్డి విదేశాల్లో హవాలా చేస్తున్నారని.. బీజేపీ నేతలు అంటున్నారు.

**పర్యటన రద్దు వెనుక ఏం జరిగిందో చెప్పాలి...**

ప్రభుత్వంలో ఉన్న పెద్దలు బిట్ కాయిన్స్, క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడుతున్నారని ప్రచారం జరుగుతోంది. రేవంత్ రెడ్డి ఏం పాలసీలు స్టడీ చేయడానికి యూనివర్సిటీలకు వెళ్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన పర్యటనలో ఏదో సమాచారాన్ని దాస్తున్నారు. దీనిపై రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డిని అమెరికాకు ఎవరు ఆహ్వానించారు..బోస్టన్,న్యూ యార్క్ లో సీఎం రేవంత్ రెడ్డి ఎవరిని కలవాలని అనుకున్నారు..న్యూయార్క్ మేయర్ మందానీ సంఘ విద్రోహ శక్తి కాదు.. ఆయన్ను కలిస్తే మాకు అభ్యంతరం లేదు. మందానీని కలవాలని అనుకుంటే సీఎం రేవంత్ రెడ్డి షెడ్యూల్‌లో ఎందుకు లేదు.. రేవంత్ రెడ్డి పర్మిషన్ ఎందుకు రద్దు చేశారో కేంద్ర విదేశాంగ శాఖ సమాధానం చెప్పాలని దాసోజు డిమాండ్ చేశారు. లేకపోతే ఇద్దరూ కలిసి డ్రామాలు ఆడుతున్నట్లు భావిస్తామన్నారు. 2024లో రేవంత్ రెడ్డి పర్యటనకు పర్మిషన్ ఇచ్చి 2026లో ఎందుకు పర్మిషన్ ఇవ్వలేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. రేవంత్ రెడ్డి స్వంత పెట్టుబడులు పెట్టడానికి వెళ్ళారా లేక రాష్ట్రానికి పెట్టుబడులు తేవడానికి వెళ్లారా..రేవంత్ రెడ్డి నిజాయితీ పరుడు అయితే తన పర్యటన రద్దు వెనుక ఏం జరిగిందో చెప్పాలని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి నోట్ల కట్టలతో తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చాలని చూశారు. రేవంత్ రెడ్డి ట్రంప్ పేరును హైదరాబాద్ లో రోడ్డుకు పెట్టారు. రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లి ట్రంప్ తో కలిసి మోదీ ప్రభుత్వాన్ని కూల్చుతారని భావించారా.. హరీష్ రావు దేవుడు గుళ్లకు వెళ్తే వివరాలు ఎందుకు చెప్పలేదు అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు..తాను విదేశాలకు వెళ్ళినపుడు ఎవరినెవరిని కలుస్తారన్నది రేవంత్ రెడ్డి ఎందుకు చెప్పరు గురివింద సామెతలా ఎందుకు రేవంత్ ఎందుకు ప్రవర్తిస్తున్నారుఇప్పుడు రేవంత్ రెడ్డి ఎందుకు చెప్పడం లేదు..రేవంత్ రెడ్డి పర్యటన రద్దుపై కేంద్ర విదేశాంగ శాఖకు లెటర్ రాస్తాం. రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీల వకాల్తా ఎందుకు..? రేవంత్ రెడ్డి ఎక్కడికి వెళ్తున్నారో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

## ఆ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలి కొండా సురేఖ

**హైదరాబాద్:** టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి తెలంగాణ మంత్రి కొండా సురేఖ మరో లేఖ రాశారు. తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవమానకర వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. వెనుక ఉండి వ్యవహారాన్ని నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివరణ ఇచ్చానని మంత్రి కొండా సురేఖ తెలిపారు. విచారణ కొనసాగుతుండగానే తనపై బహిరంగ విమర్శలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, చర్యలు కోరడం వెనుక ఉద్దేశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందాపరిశీలించాలని సురేఖ కోరారు. సీనియర్ బీసీ మహిళా నాయకురాలిపై సామూహిక దాడులు జరుగుతున్నా పార్టీ మౌనం వహించడం ఆందోళనకరమని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు విరుద్ధంగా మంత్రిసురేఖ డిమాండ్ చేశారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.